# అలల కడలి

"ఇట్టా తాగి తాగి ఎప్పుడో కల్లు పేలిపోయి సత్తావు, నంజికొడకా?" అర్ధరాత్రి తూలుతూ ఇంటికొచ్చిన కొడుకుని చూసి పైడితల్లి అరిచాడు.

కోడలు కాచి పోసిన గంజినీళ్ళు తాగి, దొరక్క-దొరక్క దొరికిన సల్లమందు పిసరు మింగి ఆరుబయట నులక మంచం వేసుకుని పడుకున్నాడు పైడితల్లి.

చిన్న కునుకు పట్టిందో లేదో, "ఓలమ్మో, సచ్చి పోనాను" అని పాకలో రంగి గోల పెడుతూంటే పైడి తల్లికి తెలివి వచ్చింది.

"సావు, నంజా! సేప పులుసు సేసి పెట్టవే అంటే ఇన్ని గంజినీళ్ళు కాసి నా మొహానోసి తొంగున్నావా? నీకు కావరం బలిసిపోనాది. మద్దినాల రొంటిని దోపుకున్న రూపాయి నాను సూడనేదనుకున్నావేటి! ఎల్లు, డబ్బులట్టి గెళ్ళి సేపట్టుకొచ్చి పులుసు కాచు. నేకపోతే నిన్ను నంజుకు తినేత్తాను" అని ఎగురుతున్నాడు పోలిగాడు.

"అర్ధరాత్రి తాగొచ్చి ఈ తందనాలేటి? ఇప్పుడేడి కెల్ళి తెమ్మన్నావు సేప ... మద్దెనాల రూపాయితోటే నూకలు కొని గంజి కాసినాను ... ఇంకా సేపలు, మాంసం ఏడొస్తాయి? నన్ను సంపక ఎల్లి తొంగో: సారాకి డబ్బు దొర్కిన సోట తిండికి దొర్కనేదేటి?" అని కసురుకుంది రంగి.

అంతే ! రంగి వీపు మళ్ళీ బద్దలయింది.

"కట్టుకున్న పెళ్లాన్ని సావబాదడానికి సిగ్గునేదూ, సచ్చినోడా! నీ సేతు లిరగ" అంటూ రంగి రాగాలు పెడుతూంది.

ఇది ఆ పాకలో మామూలే. కాస్త చేతిలో నాలుగు డబ్బులు ఎక్కువయి, ఒక సీసా ఎక్కువ దొరికిన రోజూ పోలిగాడు పేట్రేగిపోతాడు.

ఇంకా మత్తుగా ఉన్నా, చీకటిలో చేతికర్ర వెదుక్కుని కుంటికాలు ఎగరేసుకుంటూ పాకలోకి వచ్చాడు పైడితల్లి. "ఏట్రా ఎర్రెత్తినాదేటి ? అర్ధరాత్రికాడ ఇంటికొచ్చి సేపట్టుకు రమ్మంటావేటి ? ఆడకూతుర్ని సంపేత్తవేటి ?"

"నువ్వు నోరు ముయ్యేస్ !" అని కసిరాడు పోలిగాడు. సరిగా నిలబడలేక తూలుతూ పాటరాటని కరుచుకుని పెళ్లాంవైపు తిరిగి, "ఏటే, నంజా, మరాదగా ఎల్తావా, ఈ గంజినీళ్ళు నీ నెత్తిన పొయ్యమంటావా?" అన్నాడు.

"ఒరే, తప్పురా, ఎదవా. ఆడకూతురు కూలి డబ్బులు తెచ్చి ఆ పిల్లలకీ, నీకూ ఇన్ని గంజినీళ్ళు పోత్తూంది..."

"ఎవరికోసం పోత్తది, నాను మొగుణ్ణి అనుకుందా, ఉంచుకున్న ఎదవననుకుందా ?" అన్నాడు పోలిగాడు మహా గర్వంగా.

కేకలకి గోనెపట్టామీద పడుకున్న సన్నిగాడు, చిట్టి లేచి ఏడవటం ఆరంభించారు.

"ఏహా, ఏట్రా విూ గోల, ఊరుకుంటారా, నంపే మన్నారా ?" అని కొడుకుని కాలితో తన్నాడు పోలిగాడు.

"ఓలమ్మో, సంటోడు సచ్చిపోనాడు" అంటూ శావురుమంటూ కౌగిలించుకుంది రంగి.

"ఓర ... నీతో ఏ మగనాలీ బతకనేదురా. నీ లాంటోడితో బతకనేకే ఆ నత్తెమ్మ లేచిపోనాది. తిండి కావల్సినోడివి నీ ముండ కాడికి పోకపోనావు ?" అని గింజు కున్నాడు పైడితల్లి.

"నా లచ్చి పేరెత్తితే సంపుతాను, ముసిలినాయాలా" అని ఒంటికాలిమీద లేచాడు పోలిగాడు.

"ఏటే, కొడుకు నట్టుకుని ఏడ్డం అయిందా లేదా ? ఎల్తుండావా లేదా ?" అని పెళ్ళాం జుత్తు పట్టుకున్నాడు. పైడితల్లి అడ్డుపడ్డాడు. "దాని జుత్తు ఒగ్గుతావా, నేదా, తప్పుడు నంజికొడకా" అని అడ్డుకోబోయాడు. కాని, తాగిన వాడి బలం ముందు ముసిలివాడిబలం ఏపాటి ? పోలిగాడు తన్నిన తన్నుకి పాక బయటికెళ్ళిపడ్డాడు పైడితల్లి.

"నాదారి కడ్డొచ్చినావంటే సంపేత్తాను, ముసిలి నాయాలా ! అదీ, నీవూ ఏకమయి ఏసా లేత్తున్నారు ... అది తెచ్చిన డబ్బంతా నీ నల్లమందుకే సరిపోతంది. ఆ నంజ నాతో కాదు, నీతో కాపరం సేత్తంది."

"ఒరే ... ఒరే... ఆ మాలచ్చిని పట్టుకుని తప్పుడు కూతలు కూయకురా, కల్లు పేలిపోతాయి, సచ్చినోడా !" అని మూలిగాడు పైడితల్లి.

"ఆ ముసిలాణ్ణి కొట్టకు, మామా. నీకు దణ్ణం ఎడతాను."

"నాకు కావల్సింది దణ్ణం కాదే, వాణ్ణం ... పెట్టు" అరిచాడు పోలిగాడు.

"నన్ను నరికేసినా కాని డబ్బు నేదు ఇంట్లో. సంపితే సంపు. నీ పీడా, నా పీడా ఇరగడయిపోతది. ఏకంగా ఎల్లమ్మ తల్లి కాడకి ఎల్లిపోతాను పసుపు కుంకంతో ..."

పోలిగాడికి ఆకలి నకనకలాడిస్తూంది. సారాతో గొంతు మండుతూంది. ఆకలితో కడుపు మండుతూంది. కోపంతో గుండె మండుతూంది. "నిన్ను ఎల్లమ్మతల్లి దగ్గిరకి కాదు, ఏట్లోకి పంపుతాను. దగుల్బాజీ నంజికూతురా" అంటూ వంగి జుత్తు పట్టుకుని మట్టిగోడకేసి తల బాదాడు. అందినచోటల్లా దబదబ బాదాడు. దెబ్బలకి చేతు లడ్డం పెట్టుకున్న రంగి చేతులమీద మొగుడి చేతిలో సీసా కాయ పగిలి చెయ్యి అంతా గీరుకుపోయింది. దెబ్బలకి ఇటు, అటు పరుగెడుతూన్న రంగిని చూసి మరింత పేట్రేగిపోయాడు. సీసా ఎత్తి బుర్రమీద కొట్టాడు. గావుకేక పెట్టడానికి నోరు రాలేదు. కళ్ళు బైర్లు కమ్మాయి. పోలిగాడు తోసిన తోపుకి మంచంకోడుకి తల తగిలి సొమ్మసిల్లి పడిపోయింది రంగి.

"ఆడకూతుర్ని సంపేత్తన్నాడురోయ్ ... సచ్చిపోనాదిరోయ్" అని కేకలు పెడుతూ పైడితల్లి పరుగు తీశాడు బయటికి.

రక్తం చూడగానే సగం మత్తు తగ్గింది పోలిగాడికి. ఒక్క క్షణం నీరయిపోయాడు. మరో క్షణంలో అక్కడినించి

పారిపోయే వాడేకాని, వెనకనించి వెంకటేశు బలమైన చేతులు చుట్టేశాయి.

వెంకటేశుని చూడగానే మళ్ళీ కోపం తోసుకొచ్చింది పోలిగాడికి. "నువ్వా, పోకిరీ నంజికొడకా! నీ ముండని నేవదీసుకు పోనా కొచ్చావంట్రా" అన్నాడు. ఇంకా ఏదో అనేవాడే కాని, వెంకటేశు కండలు తిరిగిన చెయ్యి ముఖం మీద ఛెళ్ళుమంది. నడుం ఒడిసి పట్టుకుని బరబర ఈడ్చుకొచ్చి గుడిసె అవతల పారేశాడు.

తూరుపు తెల్లారేదాకా ఆ రాత్రంతా అలాగే పడి ఉన్నాడు పోలిగాడు.

* * *

కొడుకుని సత్తాలు వదిలిపెట్టి వెళ్ళిపోయాక ముండలు మరిగి, తాగుడు ఎక్కువయి మరీ చెడిపోతున్నాడని పైడితల్లి తనతోపాటు రిక్షాలాగే సింహాచలం కూతురు రంగిని చూసి ముచ్చటపడి కొడుక్కి చేసుకుంటానని సింహాచలాన్ని అడిగాడు. కొరమీను పులుసు వండించి, కాపు సారా కాయించి, రంగికి రెండు వెండి కడియాలు, బంగారపు ముక్కుపుడక చేయించి ఉన్నంతలో ఘనంగానే మనువు చేశాడు పైడితల్లి. మొదట్లో కొత్త పెళ్ళాం మోజుమీద రాత్రి తొందరగానే ఇంటికి వచ్చేవాడు. కొడుకు మనసు తిరిగిందని మురిసిపోయాడు పైడితల్లి. వరసగా చిట్టి, నన్నిగాడు పుట్టారు. కాని, అంతలో మళ్ళీ పోలిగాడి రిమ్మ తిరిగింది. ఎల్లమ్మ జాతరలో లచ్చి అనే సానిని మరిగాడు. ఆ గుంట నక్కలాగా ఉంటుంది. ముక్కుకి సరిపడా బేసరి,

లోపలి నల్లటి కారు నలుపు కనిపించేలాగ వాయిలు రవిక-గిడసబారిన మొక్కజొన్న పొత్తులా ఉంటుంది. ఆ తరవాత మరి ఇంటిపట్టున ఉండలేదు పోలిగాడు. అసలే తిరుగుబోతు. మరింక గుండుకు దొరక్కుండా పోయాడు.

రిక్షా లాగుతూండగా ఏక్సిడెంటయి కాలిరిగి పైడి తల్లి ఆస్పత్రిలో పడి ఉన్నా ఒక్కనాడూ ఇంటికి ఎర్రని ఏగానీ తెచ్చి ఇవ్వలేదు. రిక్షా లాగడం, ఆ డబ్బెట్టి తాగడం, మిగతాది లచ్చికి పెట్టడం— అంతేతప్ప పెళ్లాం, పిల్లలు ఎలా బ్రతుకుతారన్నది పోలిగాడికి పట్టలేదు. డబ్బీ యుక పోగా రంగి పాచిపని చేసి, కూలిపని చేసి తెచ్చిన డబ్బీయమని చావబాదడం వాడి కలవాటయిపోయింది. ఎలాగో పిల్లలకి, ముసిలాడికి ఇంత గంజి కాచిపోస్తూ రోజులు లాక్కొస్తూంది రంగి. కాని, మొగుడు ఆ కాపురాన్ని గుట్టుగా ఒక్కనాడూ ఉండనీయలేదు. రోజూ రంగి వీపు బద్దలవటం గూడానికి అలవాటయిన కథ అయిపోయింది. ఎవడు చెప్పినా వాడు వినడు. పైగా కస్సుమంటాడు. అంద రికీ రంగి అంటే జాలి, అభిమానం ఉన్నా వాడి నోటికి జడిసి ఊరుకుంటారు.

వెంకటేశు, రంగి చిన్నప్పటి దోస్తులు. రంగిని మను వాడాలని వెంకటేశుకు ఉండేది కాని, సింహాచలం కూతుర్ని మనువాడడానికి అడిగిన డబ్బీయలేకపోయాడు అప్పుడు. అప్పట్లో వెంకటేశుకు నికరమయిన పని లేదు. రిక్షా లాగిన డబ్బు అద్దె పోగా తిండికే బొటాబొటీ అయ్యేది. రంగి పెళ్ళయ్యాక వెంకటేశుకు హార్బరులో

కూలిపని దొరికాక వాడి వ్యవహారం ఇప్పుడు బాగుంది. కండలు తిరిగిన శరీరంతో ఆరడుగుల ఎత్తున ఎలక్ట్రిక్ స్తంభంలాగుంటాడు. రంగికి పెళ్ళయ్యాక కూడా చిన్నప్పటి దోస్తీతో ఎప్పుడన్నా రంగిని పలకరించడానికి గుడిసెకి వస్తూండేవాడు. అది పోలిగాడికి కన్నెర్రగా ఉండేది. వాడి పేరు చెప్పి, తాగినప్పుడు మరి రెండు తగిలించేవాడు. ఇది చెప్పుకోలేక రంగి బాధపడుతూంటే, ఓ రోజు పైడితల్లి వెంకటేశుని పిలిచి చెప్పాడు.

"సూడు, బాబూ, ఆడు రాచ్చసి తొత్తుకొడుకు. దేవుడికి దండం పెడుతూ నోరు కదిపితే బూతుమాటన్నావని తిట్టే రకం. రంగి బ్రతుకేమిటో నాకు తెలుసు. నీ నీతి నాకు తెలుసు. కాని, ఆ నంజికొడుక్కి అర్థంకాదు. అంచేత రంగి నడుం ఇరక్కుండా ఉండాలంటే రంగికి నువ్వు దూరంగా ఉండడం మంచిది. నువ్వు మంచోడివి కనక నీకిన్ని మాటలు సెప్పాను" అన్నాడు.

వెంకటేశు అర్థంచేసుకున్నాడు. రంగి కంట తడి పెట్టుకుంది. "ఇంతోటి దానికి ఏడుస్తావెందుకే, పిచ్చిదానా.... నువ్వు సుకంగా ఉండడమే నాకు కావాల. నే నేడకిపోతాను, ఈడనే ఉంటాగా" అని ఓదార్చి వెళ్ళిపోయాడు. ఆనాటికి ఈనాడు మళ్ళీ పైడితల్లి గోల విని ముందు, వెనక చూడకుండా పరుగున వచ్చాడు వెంకటేశు.

* * *

"ఇంత జరిగాక ఇంకాడి సేతుల్లో దాన్ని సావనీను. ఆడు బాగుపడాలని దాన్ని తెచ్చినాను. ఆడెలాగూ సెడి

పోనాడు. ఇంక బాగుపడదు. ఇంక దాని బతుకు సెడిపితే ఆ పాపం నన్ను సుట్టుకుంటుంది" అన్నాడు పైడితల్లి మరునాడు వెంకటేశుతో.

పోలిగాడు తెల్లవారుఝామునే మాయమయ్యాడు.

"అంటే ఏటి సేత్తావు, మామా? పిల్లల తల్లిని ఎక్కడికి పంపేత్తావు?" అన్నాడు వెంకటేశు.

"పిల్లలేంటి, తల్లేటి, నచ్చని మనువులో నచ్చేదాకా పడుండడానికి మనం సదూకున్న గొప్పోళ్ళమేంటి? ఆళ్ళకయితే తప్పదు, మనకేటి— మొదట ఇది సెప్పు. రంగి బతుకు బాగుపడడం నీ కిష్టమేనా?"

"అదేటి నా కెందుకు నేదు? మా అయ్య నీలాగ డబ్బివ్వ నేక పోనాడని దాన్ని మనువాడ లేక పోనానుగాని.. ఆ పిల్లలు నాకు పుట్టాల్సినోళ్ళు గదా" అన్నాడు వెంకటేశు, రంగిని చేసుకో లేకపోయానన్న బాధతో.

"ఒరే మనసున్నాకే మనువురా. దానికి ఆడిమీద మన సేనాడో ఇరిగి పోనాది. అది మంచిది గనక ఇన్నాళ్ళయినా కాపరం సేసినాది, ఆడి సేతిలో దెబ్బలు తింటూ. మరో త్తి అయితే ఎప్పుడో లేచిపోయేది. అంచేత మనలాంటి పెద్దలం ఇంక ఆళ్ళిద్దర్ని బ్రతకనీయకూడదు. లేకపోతే ఆడకూతుర్ని ఆడు బతకనీడు. ఆ ఉసురు మనకి సుట్టుకుంటుంది. మనసున్న చోట మనిషిని బతకనీయకపోతే, సీ, పెద్దలం మనమెందుకురా, రేపు పంతులు బాబు ఇంటికాడ పంచాయితీ ఎట్టిస్తా, అందరి ముందు ఆళ్ళిద్దరికీ తెగతెంపులు

చేసి మీ ఇద్దర్ని కలిపేస్తా. ఆణ్ణి కన్న పాపానికి ఈ యిదంగా నా ప్రాయచ్చితం చేసుకుంటా" అన్నాడు పైడితల్లి రాత్రి డొక్కలో తన్నినచోట నొప్పిని గుర్తుచేసుకుంటూ.

మళ్ళీ అంతలో గుర్తొచ్చి, "వెంకటేశూ ... దాని పిల్లలు... ఆ గుంటెదవలు..." అన్నాడు.

"నీకెందుకు, మామా, ఆ అనుమానం? రంగి పిల్లలు నాపిల్లలుకా రేంటి, మనువు రేపుకాదు, నాలుగేళ్ళనాడే అయిందనుకుంటాను" అన్నాడు.

"నాకు తెలుసురా నీ మనసు, వెంకటేశూ" అన్నాడు పైడితల్లి ఆనందంగా.

## 2

ఆ గూడెంలో ఏ తగాదా వచ్చినా తీర్పుకి అంతా చలపతిరావుగారి ఇంటికి వస్తారు. ఆయన పరపతి, వయస్సు, నిజాయితీ, మంచితనం వాళ్ళకాయన పట్ల గురి ఏర్పరిచాయి.

నాలుగు రోజుల తరవాత పైడితల్లి చలపతిరావుగారి వీధి వరండాలో పంచాయితీ పెట్టాడు. గూడెంలో పెద్దలందరూ వచ్చి కూర్చున్నారు. వెంకటేశు ఓ పక్క కూర్చున్నాడు. పోలిగాడు తలదించుకుని మూల కూర్చున్నాడు.

విషయం అంతా విని చలపతిరావుగారు ఉద్రేకపడ్డారు. ఆడదానికి జరిగిన అత్యాచారానికి ఆయన గుండె మండింది. రక్తం కళ్ళలో దూకుతూంది. ఆయన స్వభావం

తెలిసిన అక్కడివాళ్ళు ముందే ఏ తీర్పు చెప్పేదీ ఊహించగలిగారు.

వసారా నిశ్శబ్దమయింది. పోలిగాడికీ ఆ విషయం తెలుసు. ఇరుక్కున పేనులా కూర్చున్నాడు. ధైర్యంచేసి నోరు విప్పాడు. "సుక్కమీద మాట తూలాను, బాబూ. ఇంక పొరపాటు చెయ్యను, మా అయ్య సచ్చినంత ఒట్టు."

"భష్, లంజకొడకా ! నాలుగేళ్ళనుంచీ చెబుతున్నావా మాట! నువ్వసలు మనిషివా, పశువ్వా? ఆడకూతురు ఒంటిమీద చెయ్యి వెయ్యడానికి సిగ్గు లేదురా ? అది నీకు తిండి పెడుతూంది. పిల్లల్ని కంటూంది. తాగుడుకి డబ్బిస్తూంది. ఒక్కరోజు ఈయలేదని బుర్ర బద్దలు గొడతావా? రేపట్నించి దాని జోలికి వెళ్ళావంటే గొయ్యి తీసి పాతించేస్తాను" అని పెద్దలవైపు తిరిగి, "మంచిరోజు చూసుకుని మీ ఆచారం ప్రకారం వెంకటేశుకి, రంగికి మనువు జరిపెయ్యండి. ఈ తొత్తు కొడుకు వాళ్ళ గుడిసెవైపు వెడితే నాకు చెప్పండి" అని ఉద్రేకంతో కండువా దులుపుకుని లేచారు చలపతిరావుగారు. అందరూ ఆ తీర్పుకి సంతోషిస్తూ లేచి ఇంటిముఖం పట్టారు.

ఇంట్లోకి వెళ్ళబోతున్న చలపతిరావుగారు ఇంటి ముందు రిక్షా ఆగడం చూసి ఆగారు. కూతురు శకుంతల అయిదుగురు పిల్లల్ని వెంటబెట్టుకు లోపలికి వస్తూంటే —

"అమ్మా, శకుంతలా, ఇదేమిటమ్మా ఇంత సాయంత్రం పడ్డాక ఇలా వచ్చావు" అంటూ ఎదురెళ్ళారు.

లోపలికి అడుగు పెడుతూనే "నాన్నా" అంటూ బావురుమంటూ శకుంతల తండ్రి గుండెలమీద వాలిపోయింది.

"ఏమిటి, తల్లీ, ఏం జరిగింది? చెప్పమ్మా... ఏం జరిగింది, తల్లీ?" సంగతి తెలియక గాభరా పడిపోయారు చలపతిరావుగారు. గలభాకి లోపలినుంచి వచ్చిన పార్వతమ్మ కూతుర్ని చూస్తూనే సంగతి గ్రహించేసింది. "ఏముంది — మళ్ళీ కొట్టి ఉంటాడు మీ అల్లుడు... అయ్యొయ్యో, ఆ చేతులమీద ఎట్లా వాతలు పడ్డాయో! ఎందుకే, తల్లీ, ఇలా కొట్టాడు? ఏం జరిగిందే, తల్లీ? అయ్యో, చేతు లెలా వస్తాయో ఇలా కొట్టడానికి!" పార్వతమ్మ కూతుర్ని దగ్గిరకి తీసుకుని చేతులమీద, చెంపల మీద వాతలు చూస్తూ బెంబేలు ఎత్తిపోయింది.

శకుంతల తల్లితండ్రుల కౌగిలిలో కాస్త ఊరట పొందింది. తలఎత్తి శుష్కహాసం చేస్తూ, "ఎప్పుడు కొట్టలేదని అడుగమ్మా? ఎందుకు కొట్టాడన్న ప్రశ్న ఏమిటమ్మా? దేనికి కొట్టడు అని అడగాలి" అంది.

"హుఁ ఇంక అతను మారడు, తల్లీ. నీ జన్మ ఇలా వెళ్ళమారవలసిందేనమ్మా" బాధగా కూతురు చేతిమీద వాతలు తడుముతూ అన్నారు చలపతిరావుగారు.

"నాన్నా...ఇంక నే నక్కడ ఉండలేను, నాన్నా... ఈ దెబ్బలు తినే శక్తి ఇంక నాకు లేదు. ఆ మాటలు, ఆ తిట్లు అన్నీ సహిస్తూ పడివుండే ఓరిమి ఇంక నాకు లేదు, నాన్నా ... నాకు, నా పిల్లలకి ఇంత తిండి పడేసి ఈ

గుమ్మంలో ఉంచుకోలేవా, నాన్నా ... నాకేదన్నా పని చూసిపెట్టు. నా మెట్రిక్ చదువుకి ఏదన్నా ఉద్యోగం దొరకదా, నాన్నా ... పోనీ, రెండిళ్ళలో వంట పని చేసుకుంటూ ఈ పిల్లల్ని పోషించుకుంటూ ఈ పంచలో పడుంటాను. ఇంక అక్కడికి వెళ్ళమనకు, నాన్నా, నన్ను ..." చావిట్లో కూలబడి చేతులలో మొహం కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ అంది శకుంతల.

"ఏడవకే, తల్లీ. ఏం పుట్టకే, అమ్మా, మనది! ఎందుకొచ్చిన ఆడబతుకే, తల్లి!" అంటూ ఆవిడ కూతురితో పాటు కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ కూర్చుంది.

చలపతిరావుగారి గొంతునిండా దుఃఖం పొంగింది. ఏం చెయ్యాలో తోచని అసహాయస్థితి, ఏం చెయ్యలేని అసమర్థత ఆయన్ని నిస్సహాయుడిగా నిలబెట్టి, కూతురి కేం ఓదార్పు చెప్పాలో తెలియకుండా చేశాయి.

"ఊరుకో, తల్లి చూద్దాం ... ఏదో చేద్దాం. ముందు కళ్ళు తుడుచుకో" అని మాత్రం అనగలిగారు కాసేపటికి.

"ఏం చేస్తారు మీరు? పదేళ్ళబట్టి చూస్తూ ఏం చెయ్యగలిగారు? ఇప్పుడు మాత్రం ఏం చేస్తారు? నలుగురు మగపిల్లల తరవాత అపురూపంగా పుట్టిన ఆడపిల్ల. పువ్వుల్లో పెట్టి పెంచి తీసుకెళ్ళి ఆ రాక్షసుడి కప్పగించాం. అంతే... ఒక్కనాడన్నా అది సుఖపడలేదు. పదేళ్ళబట్టి ఆ నరకంలో అది మగ్గిపోతూంటే మీరు, నేను ఏడవడం మినహా ఏం చెయ్యగలిగాం?" పార్వతమ్మ అంది బాధగా.

ఆవిడ మాటలు ఆయన్ని మరింత బాధ పెట్టాయి. నిజమే, తనేం చెయ్యగలడు ? ఆడపిల్లని కన్నాడు. అపురూపంగా పెంచాడు. ఓ అయ్య చేతిలో పెట్టాడు... అంతే. ఆ తరువాత ఆ పిల్ల సుఖపడినా, కష్టపడినా, మొగుడు మంచివాడయి ఆదరించినా, దుర్మార్గుడై హింసించినా ఆ పిల్ల అదృష్టం అని సరిపెట్టుకోవడం మినహా నోరెత్తే హక్కు తమకేది ? ఆ హక్కే ఉంటే కూతురు ఒంటిలో ప్రాణం లేదని తెలిసీ అల్లుడలాగ పిల్లలమీద పిల్లల్ని కంటూ ఉంటే వద్దని హితవు చెప్పగలిగాడా ? చెప్పినా విన్నాడా ? పోషించే శక్తి లేకపోయినా చేతకాని పౌరుషంతో, పంతంతో భార్యని చావబాది ఇల్లు నరకం చేస్తుంటే ఒక్కనాడన్నా తాము మందలించగలిగారా ?

ఆయన నిట్టూర్చి "నిజమే నే, మనం ఏం చెయ్యగలం-దాని దురదృష్టాన్ని చూస్తూ ఏడవడం మినహా ? నేనేం చెయ్యను, తల్లీ. ఏం చెయ్యగలనో నీవే చెప్పమ్మా. మొగుణ్ణి వదిలిపెట్టి వచ్చిన కూతుర్ని ఇంట్లో ఉంచి ఆదుకోగలనా ? లోకులనే మాటలని సహించగలనా ! నీకు, నీ పిల్లలకి భవిష్యత్తుకి- అందరిని కాదని జవాబుదారీ వహించగలనా ? ఈ మన సంఘంలో మొగుణ్ణి వదిలిన ఆడదానికి ఉండని పరువు, మర్యాదని తెచ్చిపెట్టగలవా ? వీటిలో నే నేది చెయ్యగలనో నీవే చెప్పు, తల్లీ ! సరే, నే ఉన్నన్నిరోజులు నీకింత తిండి పడేస్తాను — ఆ తరవాత నీ గతేమిటమ్మా... ఒంటరి ఆడది పిల్లలని పెట్టుకుని ఈ దేశంలో బ్రతకగలదా ! నీవు అందరిని కాదని ఎదిరించి ఒంటరిగా పిల్లలని పెంచగలవా ?

పెళ్ళిళ్ళు చెయ్యగలవా! మొగుడు లేని ఆడదాని కూతుర్ని పెళ్ళాడడానికి ఈ దేశంలో ముందుకు వచ్చేవాళ్లెవరు, తల్లీ! తండ్రిలేని పిల్లలకి సంఘంలో స్థానం కల్పించగలవా? ఏది చెయ్యగలవు చెప్పమ్మా." ఆవేశంగా అన్నారు చలపతి రావుగారు.

"నాన్నా... ఇన్ని మాటలు చెప్పి బాధపెట్టకు, నాన్నా.. మరింత భయపెట్టకు." దీనంగా బావురుమంది శకుంతల. "మళ్ళీ అక్కడకు వెళ్ళమనకు, నాన్నా" అని ప్రాధేయపడింది.

"చూడు, తల్లీ, ఇందాక రంగి మొగుణ్ణి వదిలి మరో కణ్ణి కట్టుకుంది. ఏదీ అంత ధీమాగా నీవు చెయ్యగలవా? లేదమ్మా. ఆ అదృష్టం మనలాంటి వాళ్ళకి లేదు. మొగుడు వదిలేసినా, మొగుణ్ని వదిలినా వాళ్ళనేం లోకం అనదు. దాని బ్రతుకు అది బ్రతకగలనన్న ధీమా దానికుంది. ఒక పెళ్ళికే గగన మవుతున్న మనకు మరో పెళ్ళి ఎవడు చేసుకుంటాడు, తల్లీ? మనకు అలా ఎలా కుదురుతుంది, తల్లీ!"

"నాన్నా, నేనేం చెయ్యను? ఎలా బ్రతకను ఇంకా అక్కడ? నేనో మనిషిగా చెలామణీ కావడంలేదు అక్కడ. నన్ను పశువుకంటే హీనంగా చూస్తూంటే ఎన్నాళ్ళని సహించను? నా కలలు, ఆశలు ఏవీ నెరవేరవని, ఆ మనిషి స్వభావం తెలిసి అన్నీ చంపేసుకుని మనసు రాయి చేసుకుని అలాగే బ్రతకడం ఆరంభించాను— పిల్లలు పుట్టుకొచ్చాక వాళ్ళకోసం అన్నా బ్రతకాలని బ్రతుకుతున్నాను.

అయినా... ఇంకా...ఇలా హింస భరించే శక్తి నాకు లేదు, నాన్నా..."

ఆ మాటలు వింటూ కన్నీరు తుడుచుకున్నారు చలపతిరావుగారు. అమ్మాయి కష్టాల్ని విని కన్నీరు కార్చడమే గాని, తీర్చగలిగే అవకాశం తమకు లేదని ఆయనకు తెలుసు.

పంచాయితీలో పరవళ్ళు తొక్కిన ఆయన ఉద్రేకం తను బ్రతికే సంఘంలో, తన నిజ జీవితంలో చల్లబడి పోయింది. రంగి మనువు గర్వంగా దిద్దగలిగిన ఆయన ఆత్మశక్తి తన కూతురు దగ్గరకి వచ్చేసరికి సరిపోలేదు.

ఆయన కూతురు విషయంలో గుండెరాయి పుష్కరం క్రిందే చేసుకున్నారు. ఆయన లేచి నిలుచుని భార్య, కూతురు వంక చూడకుండానే— "రేపు ప్రొద్దునే సిద్ధం కా, తల్లీ. అల్లుడి దగ్గరకెడదాం. ఆలస్యం అయితే మళ్ళీ కోపం రావచ్చు" అంటూ బయటికి వెళ్ళిపోయారు.

ఆయన ముఖంలో గాంభీర్యానికి తల్లి కూతుళ్ళకి మాట పెగల్లేదు.

*　　　*　　　*

అల్లుడి ఇంటిముందు బండి దిగారు చలపతిరావుగారు. శకుంతల ఒంట్లో ప్రాణం, ఒంటిమీాద తెలివి లేనట్టే తండ్రి వెంట బలిపశువులా వచ్చింది. సూర్యనారాయణ మామ గారిని కన్నెత్తి చూడలేదు. సావిట్లో అల్లుడిముందు తప్పు చేసిన కుర్రాడిలాగ చేతులు జోడించి జీవితంలో మొదటి సారిగా నిలబడ్డారు హెడ్మాస్టర్ చలపతిరావుగారు. గోడకి

జారిగిలబడి, నిశ్చేష్టురాలయి నిలబడిన కూతురు వింటూండగా ఇలా మొర పెట్టుకున్నారు—

"బాబూ, సూర్యనారాయణా! నాకు నువ్వూ, నా కొడుకు వేరుకాదు. లేకపోతే ఈమాత్రం స్వతంత్రించి మాట్లాడేవాడిని కాను. నా పెళ్ళాం, నా బ్రతుకు నువ్వేవడివి అంటే నోరుమూసుకుని ఈ గడప దాటి పోవాలి నేను. కాని, చూడు బాబూ, అది నలుగురు మగపిల్లల తరవాత అపురూపంగా పుట్టింది. మా ఇంట లక్ష్మి పుట్టిందని పువ్వుల్లో పెంచాను. అలా అని దాన్ని పనికిమాలినదానిగా చేసి నీ కప్పగించలేదు. చదువూ సంధ్యా, పనీ పాటా— అన్నీ నేర్పి పంపాను. అలాంటి దీనాడు వానపాములాగ ఎలా గోడ కంటుకుపోయిందో చూశావా? నిన్నేం అనడం లేదు, బాబూ. ఆరు పురుళ్ళకి దాని ప్రాణాలు కడంటాయి. శరీరమంతా కలిపితే రెండు శేర్ల మాంసం లేదు. దానికి తోడు చావు దెబ్బలు. అబ్బే, కాదనడం లేదు. కొట్టు బాబూ, కొట్టు. కొట్టే హక్కు మొగుడికి కాక ఇంకెవరికుంది? దానికాలికి రాయి తగిలితే ఆ రాయి పిండి చేయాలన్నంత పౌరుషంగా ఉండే అది, ఇలా శరీరమప్పగించిందంటే ఎంత మారిందో ఆలోచించు. దాని కాలిలో ముల్లు గుచ్చుకుంటే రాత్రంతా లేచి కాలు సవరించే నాకు దాని ఒంటిమీద వాతలు ఎంత కోత పెడుతున్నాయో ఆలోచించు. పువ్వుల్లో పెట్టి పెంచిందిందుకా? పిల్లల్నికని, మన వంశాలని ఉద్ధరించే ఆ దేవతలకి మనం చూపే పవిత్రత

ఇదా ? పోనీబాబూ, కోపం వద్దు. నా కిలా మాట్లాడే అర్హత లేదు. అది ఏదో తొందరపడి నా దగ్గరకి వచ్చేసింది. రావలసిన మనిషి కాదు. పదేళ్ళదుఃఖాన్ని దిగమింగిఒక్కసారి ఈ బ్రతుకునిచ్చిన తండ్రిని 'నన్నెందుకు పుట్టించావు, నాన్నా' అని అడగటానికి వచ్చింది. అదిదానితప్పే, బాబూ— ఆ పొరపాటుకి దాని బదులు నేను క్షమాపణ చెప్పుకుంటున్నాను. ఇంకెప్పుడూ అలా రాదు. వచ్చేహక్కు దానికి లేదు. బాబూ, దాన్ని ఏనాడో నీ కప్పగించాను. లేవదీసి గుండెల కత్తుకుంటావో, ఒక్క తన్ను తన్ని బుగ్గిలో కలిపేస్తావో అంతా నీ ఇష్టం— నీ చేతుల్లో ఉంది. నేనేం అడగను. అందుచేత, బాబూ, పదేళ్ళు అది నీకు శరీరాన్ని అప్పగించిన పుణ్యానికి దానికింత అన్నంపడేసి, నీ పిల్లల్ని సాకుతూ ఈ పంచలో బ్రతకనియ్యి. అది తప్పుచేస్తే కొట్టు. అసలే విరిగిన నడుముని మరీ మరీ విరగ్గొట్టు. జుత్తు పట్టుకు గోడకేసి కొట్టు— చంపేయి. నేను నోరన్నా ఎత్తితే అడుగు. ఈ దేశంలో ఆడదానికి పెళ్ళయ్యాక బ్రతుకయినా, చావయినా ఇక్కడే బాబూ. కాని, ఒక్కమాట. అది ఏనాడన్నా చచ్చిపోతే, దాన్ని కన్నపాపానికి దాన్ని గుప్పెడు మట్టి చేసేటప్పుడు ఈ ముసలాడికి కబురుపెట్టు. వచ్చి మహా పతివ్రతగా, భర్తచేతుల్లో తనువు చాలించిన ఆ ఇల్లాలి బుగ్గిని తీసుకెళ్ళి దేవతార్చన పెట్టెలో పెట్టుకుంటాను. ఆడపిల్లల్ని కనకండిరా, కన్నా పువ్వుల్లోపెట్టి పెంచకండ్రా, వెధవల్లారా అని నా కొడుకులందరికీ తలో పిడికెడు బుగ్గి పంచుతాను. అందుచేత దాన్ని క్షమించు. ఆడపిల్లల్ని కన్న

దౌర్భాగ్యానికి నన్ను క్షమించు.” చలపతిరావుగారు కంఠం రుద్ధమవుతూండగా ఇంకేమీ మాట్లాడలేకపోయారు. సూర్యనారాయణ వింటూ ఏమీ మాట్లాడలేదు. కళ్ళు తుడుచుకుని కూతురి మొహం చూసే ధైర్యంలేక తనది కాని వస్తువుని మరచిపోయినట్లు గడప దాటి వెళ్ళిపోయాడు కన్నతండ్రి.

ఇన్నాళ్ళకి మామగారి మాటలతో భార్యపట్ల తన హక్కు పునఃప్రతిష్ట మయినందుకు గర్వంగా ఉంది సూర్యనారాయణకు. కుర్చీలోంచి లేచి, గోడకి కరుచుకుని ఉన్న భార్య జుత్తుపట్టుకుని, “ఇప్పటికయినా నీ బ్రతుకేమిటో తెలిసిందా, గాడిదా! బ్రతుకుమీద ఆశవుంటే ఈ గడపలో పడివుండు... ఏ నాన్నా నిన్ను ఆదుకోడని అర్థమైందా? మళ్ళీ గడప దాటావా కాళ్ళు విరగ్గొడతాను” అంటూ గోడకేసి తల బాది వెళ్ళిపోయాడు అవతలికి.

అవతల సూర్యనారాయణకి చాలా అర్జెంటు పనులు ఉన్నాయి కనక అంతటితో వదిలాడు. యజమానురాలు రేపు రెండో పెళ్ళి చేసుకుంటుంది. రేపుసాయంత్రం డిన్నర్ పార్టీకి ఎన్నో ఎరేంజిమెంట్లు చేయాలి. బోలెడు పనిఉంది అని అప్పటికే ఆలస్యం అయింది కనక గబగబ వెళ్ళిపోయాడు.

ఆ గోడ దగ్గిరే కుప్పలా కూలిపోయిన శకుంతల స్పృహ కోల్పోయిందని అతనికి తెలియదు.

# 3

కన్నెత్తి చూస్తేనే కాని కనిపించని ఆ మేడ టెర్రేస్ మీద ప్రఖ్యాత సాంఘికవాది, మహిళా సేవా సంఘ గౌరవ సలహాదారుడు, రాజకీయవాది అయిన రాజారావు గారి భార్య శ్యామలాదేవి మరొకరి భర్త కౌగిలిలో ఆనం దిస్తూంది ఆ చల్లని రాత్రి !

స్నానంచేసి ఉల్లిపొర లాంటి, పాల మీగడ లాంటి నైట్ గౌన్ తొడుక్కుని, లవండర్ పరిమళంతో వచ్చిన శ్యామలాదేవిని చూస్తూ రెండు చేతులూ చాచాడు రామ మోహన్‌రావు. చాచిన అతని చేతుల్లో వాలి అతని గుండె ల్లో మొహం దాచుకుంది ఆమె. "శ్యామ్... శ్యామ్" అన్నాడు పారవశ్యంగా అతడు. "నేనెంత అదృష్టవంతుడ్ని ! ఇంత అందం, ఇంత ఆనందం పొందడానికి నే చేసిన పుణ్యా మేమిటి చెప్పూ...చెప్పూ, శ్యామ్" అన్నాడు ఆమె మొహాన్ని రెండుచేతుల్లోకి తీసుకుని, వాలిన ఆమె కనురెప్పల్ని సున్ని తంగా పెదాలతో అద్దుతూ.

"అంత అదృష్టమూ నీ ఒక్కడివే తీసుకోకు. నాకూ భాగం ఉంది... రామ్, అదృష్టము నీది కాదు. నాది అని నే ననుకుంటున్నాను..." అంది ఆమె ఆర్తిగా అతణ్ణి చేతు లతో బంధిస్తూ.

"శ్యామూ... శ్యామూ, నాలో ఏం చూశావు ? నన్నింతగా కోరడానికి నాలో ఏం కనిపించింది ? ఇంతఅందం, ఆస్తి, అంతస్తు అన్నీ ఉన్న నీవు, ఏమీలేని నాలో ఏం

చూసి..." ఎన్నోసార్లు అడిగిన ఆ ప్రశ్న మళ్ళీ అప్పుడూ అడగకుండా ఉండలేకపోయాడు అతను.

"ఆ ప్రశ్న ఎన్నాళ్ళయినా మానవన్నమాట..." చిరుకోపంతో ఆమె అతని బుగ్గ చిలిపిగా గిల్లుతూ, "నీలో ఏం చూశానా ? చెప్పనా ? నీలో కళారాధకుడి హృదయాన్ని చూశాను. అందాన్ని ఆరాధించి, ఆస్వాదించగలిగే హృదయాన్ని చూశాను. ప్రేమించగలిగే మనస్సుని చూశాను. ఆ ప్రేమని అందంగా మాటలలో పొదిగి, అవతలివారి మనసు లనురంజింపచేసే నైపుణ్యాన్ని చూసాను. మూగపోయినవీణని శ్రావ్యంగా, మధురాతిమధురంగా పలికించగలిగే నైపుణ్యానికి ముచ్చటపడ్డాను. నా హృదయాన్ని, ప్రేమకి నోచుకోక వాడిపోయిన నా హృదయాన్ని చిగిరింప చేసిన నీ ప్రేమానురాగాలనిచూశాను...చాలా, ఇంకా ఏంచూశానో మళ్లీమళ్లీ చెప్పాలా ? రామ్... నీలో నేను వెదికింది డబ్బుకాదు... ఆస్తి, అంతస్తులు కాదు. వెధవ డబ్బు... నాకేఉంది కట్టుకుపోయేటంత... హుఁ... డబ్బు ఎంత సుఖం ఇచ్చిందో ఇంకా నాకు తెలియలేదనుకున్నావా ? నా పాతజీవితం నాకునేర్పిన పాఠాన్ని అప్పుడే మరిచిపోయా ననుకున్నావా ? రాజారావుని పెళ్లాడి నేనెంతనష్టపోయానో నీకేం తెలుసు, రామ్ ? గడిచిపోయిన జీవితంలో నష్టాన్ని ఈ లక్షలన్నీ పూడ్చగలవా, రామ్ ! ఇంకా డబ్బు, ఆస్తులు, అంతస్తులు చూసి మళ్ళీ మోసపోయేంత తెలివితక్కువదాన్ని కాను. రామ్... నిన్ను నీవు కించపరుచుకుంటూ నన్ను చిన్నపుచ్చకు. మన మధ్య డబ్బు ప్రసక్తి రాకూడదు. మన ఆనందానికి ఆస్తులు,

అంతస్తులు అడ్డు రాకూడదు. రామ్, నీకు తెలియదు—ఈ ప్రేమానురాగాలకోసం ఎంత అలమటించానో? అన్నీ ఉన్నా ఏమీలేని పేదరాలిలా బ్రతికాను ఇన్నాళ్ళూ. ఇన్నాళ్ళకి నా జీవితానికి పరిపూర్ణత సిద్ధించిం దనిపిస్తూంది. ఈ వయసులో ఈ ప్రేమ ఏమిటి అని నలుగురూ నవ్వనీ. లోకం అంతా కలిసి మనల్ని వెలేయనీ. నాక్కావలసింది నాకు ఇన్నాళ్ళకి దొరికింది." ఆవేశంగా అతణ్ని హత్తుకు పోతూ అంది శ్యామలాదేవి.

"శ్యామ్... మన పెళ్ళి చిన్న దుమారం లేవదీస్తుం దేమో? నీ మిత్రబృందం ఆశ్చర్యపోతారు. నీ హితైషులు ఈ సంగతి తెలిసి నీతులు చెప్పబోతారు... శ్యామూ, మనల్ని ఈ లోకం సవ్యంగా బ్రతకనిస్తుందంటావా?"

శ్యామలాదేవి నిర్లక్ష్యంగా నవ్వింది. "రామ్... ఈ మనుష్యుల నోళ్ళు మూయించగలిగే ఆయుధం నా దగ్గ రుందని మరిచిపోకు. నా లక్షలు, నా అంతస్తు ఎవరన్నా ఎదుటపడి విమర్శించగలిగే ధైర్యాన్నీయవు. మన వెన కాల అనుకుంటారు... అనుకోనీ. మనకేం నష్టం? వీళ్ళంతా అని, అనుకుని మనల్ని చేయగలిగిందేమిటి? నాక్కావల సింది పొందగలిగానన్న తృప్తి, ఆనందం ముందు లోకులను కునే మాటలు నన్నేం చెయ్యగలవు?" కసిగా అంది ఆమె.

"శ్యామూ... శ్యామూ..." పారవశ్యంతో ఆమెని దగ్గిరకి లాక్కుంటూ ఇంకేం మాట్లాడలేకపోయాడు అతను.

* * *

ఆ పెద్ద బంగళా ఆవరణం అంతా ఆ రోజు నిగనిగలాడే రంగురంగుల కాగ్లతో నిండి ఉంది. ఆ భవంతి ఆవరణాలో చెట్లనిండా రంగురంగుల బల్బులు తమాషా ఆకారాల్లో వెలిగి ఆరుతున్నాయి

ఆ బంగళా పెద్ద హాల్లో మొజాయిక్ ఫ్లోర్ నున్నగా అద్దంలా తళతళ లాడుతూంది. సీలింగ్ నించి వేలాడే ఖరీదయిన ఛాండిలియర్స్ రంగురంగుల కాంతు లీనుతున్నాయి. విదేశీ కార్పెటులు, ఖరీదయిన నిగనిగలాడే ఫర్నిచర్, అందంగా అమర్చిన డెకరేషన్ పీసెస్, డబ్బుతో పాటు ఆ యజమానులకి అభిరుచి ఉన్నదని తెలిపే ఖరీదయిన పెయింటింగ్స్, గాలికి రెపరెపలాడే అందమైన సిల్కు పరదాలు, ఎటు చూసినా ఆ భవంతి వైభవానికి, నాగరికతకి చిహ్నంగా కనిపిస్తూంది.

ఆ ఖరీదయిన హాలు ఆరోజు ఖరీదయిన మనుష్యులతో నిండి ఉంది. రంగురంగుల చీరలు, రకరకాల సిగలు, ఖరీదయిన సూట్లు, నిగనిగలాడే బూట్లు ఎటు చూసినా కనిపిస్తున్నాయి. విదేశీ సుగంధం పరిమళిస్తూంది ఆ హాలంతా ! ఓ ప్రక్క రేడియోగ్రామ్ సన్నగా పాశ్చాత్య సంగీతం వినిపిస్తూంది.

ఆడవాళ్ళు సోఫాల్లో కూర్చుని, మగవాళ్ళు జట్లు జట్లుగా నిలుచుని అట్టహాసంగా కబుర్లు చెప్పుకుంటున్నారు. రంగురంగుల పానీయాలు నింపిన ఖరీదయిన, అందమైన గ్లాసులు అందరి చేతుల్లో ఉన్నాయి. మొత్తంమీద ఆ

సాయంత్రం ఆ బంగళాలో వాతావరణం ఈనాటి నాగరి కతా ప్రపంచానికి నిలువుటద్దంలా ఉంది.

ఈ హడావిడికి, ఆర్భాటానికి కారణం— ఆరోజు ఉదయం ఆ బంగళా యజమానురాలు శ్యామలాదేవి తను ప్రేమించిన రామ్‌మోహన్‌రావుని దేవాలయంలో శాస్త్రోక్తంగా వివాహం చేసుకుంది. ఆ వివాహం సందర్భంలో సాయంత్రం పెద్ద విందు ఏర్పాటు చేసింది. ఆమె పరిచయస్థులు, స్నేహితులు, ఊర్లో పెద్దలు చాలామంది వచ్చారు. పెళ్ళి చేసుకోవడం, డబ్బు పుష్కలంగా ఉంటే హడావిడిగా విందులు ఏర్పాటు చేయడంలో ఏం వింత లేదు. ఎటొచ్చీ ఈ పెళ్ళిలో వింత అల్లా ఇటు శ్యామలా దేవి, అటు రామ్‌మోహన్‌రావూ— ఇద్దరూ వివాహితులవడం అన్నది వింత విషయం. అందులో రామ్‌మోహన్ రావుకి ముగ్గురు పిల్లలున్నారు. శ్యామలాదేవికి ఒక కొడుకు ఉన్నాడు.

శ్యామలాదేవికి వివాహం ఎప్పుడో అయింది. రాజా రావు శ్యామలాదేవిని పెళ్ళిచేసుకున్నాడని చెపితే పొరపాటు అవుతుంది. శ్యామలాదేవి రాజారావుని పెళ్ళాడిందనాలి. కాని, రాజారావు మహిళా సేవా సంఘ కార్యకలాపాలమీద శ్రద్ధ చూపినట్టు మహిళల మీద చూపలేకపోయాడు! సంఘాన్ని పురోగమింపచెయ్యాలని ఉపన్యాసాలిచ్చే హడావిడిలో తన సంసార జీవితం అక్కడే నిలిచిపోయిందని గుర్తించలేకపోయాడు. అతను ప్రఖ్యాత సాంఘికవాది. కాని, సామాన్యమయిన భర్తకూడా కాలేక

పోయాడు. అందుకని అచిరకాలంలోనే శ్యామలా దేవి విడాకులు తీసుకుంది. ఒక్కగానొక్క కొడుకు స్విట్జర్లెండ్ లో చదువుతున్నాడు.

ఇప్పుడీ వివాహం అతిథులందరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచింది. నాగరిక ప్రపంచంలోనూ కాస్త సంచలనం, చర్చ లేచాయి.

"అతని భార్యకీ లక్ష రూపాయలు ఇచ్చి వదిలించుకుందట కదా, శ్యామల ?" పక్కనున్న మిసెస్ దేశ పాండేతో నెమ్మదిగా అంది మిసెస్ బెనర్జీ. "ఏమన్నా చేస్తుంది. లక్షలున్నాయిగా, తండ్రి ఇచ్చిపోయాడుగా...." అంది ఆవిడే మళ్ళీ అసూయగా.

"ఏం అభిరుచి ! డబ్బు ఉండవచ్చు. కానీ, అలా అక్కరలేని భర్తనించి స్వేచ్ఛ సంపాదించుకుని, కావలసిన భర్తని కొనుక్కోవడమే డబ్బు పరమార్థం అంటాను నేను" అంది మిసెస్ దేశ్ పాండే. ఆవిడ ఈమధ్య విడాకుల కేసులో ఓడిపోయాక మళ్ళీ పాత భర్తతో కాపురం చేస్తూంది.

"ఈవిడగారికి ముప్ఫై అయిదు దాటాక, ఆయనగారు నలభయ్యోపడిలో పడ్డాక ఇప్పుడీ పెళ్ళి ఏమిటో !" మిసెస్ రామనాథానికి ఈ ప్రేమ పెళ్ళిళ్ళమీద ఏం సానుభూతి లేదు. అందుకే వ్యంగ్యంగా అంది.

"అసలింతకీ వీళ్ళిద్దరికి పరిచయం, ప్రేమించుకోవడాలు ఎలా ఆరంభమయ్యాయో మీకు తెలుసా ! ?" మిసెస్ థామస్ పక్కనున్న మిసెస్ నంబియార్ ని అడిగింది.

"ఆస్తా, అంతస్తా—ఏం చూసి ప్రేమించిందట ?" ఆవిడ అనుమానాన్ని బయటపెట్టలేకుండా ఉండలేక పోయింది.

"ఏమో, సరిగా తెలియదు. కానీ... అతను మంచి పెయింటర్, కవిట ! ఈవిడికి కాస్త కళలపిచ్చి ఉందిగా ! ఎప్పుడో అతని పెయింటింగ్స్ ఎగ్జిబిషన్‌లో శ్యామల అతణ్ని కావాలని పరిచయం చేసుకుని అభినందించిందట. శ్యామల తన లైఫ్ సైజ్ ఆయిల్ పెయింటింగ్ వేయమందిట. అప్పుడు ఇద్దరి మధ్య మైత్రి బాగా పెరిగి ఉంటుంది. అలా అలా ప్రేమలోపడి ఉంటారు." తనకి తెలిసినంతవరకు వివరించింది ఆవిడ

ఇటు ఆడవాళ్ళ విమర్శలు అలా ఉంటే, అటు మగాళ్ళు రామ్‌మోహన్ రావుకి పట్టిన అదృష్టానికి అసూయ పడుతున్నారు. లక్షాధికారిణి, అందగత్తె అయిన శ్యామలా దేవి రామ్‌మోహన్ రావులో ఏం చూసి పెళ్ళి చేసుకుందో వాళ్ళకి అర్థంకావడంలేదు. రామ్‌మోహన్ రావులో ఉన్నదీ, తమలో లేనిదీ ఏమిటా అని ఎవరికి వారే మథన పడుతున్నారు. ఆవిడ చేసిన పని బాగోగుల గురించి చర్చిస్తున్నారు.

ఏమయినా శ్యామలాదేవి చేసిన పని గురించి చాటు మాటుగా గుసగుసలాడుకోవడం, అనుకోవడం తప్ప పబ్లిక్‌గా ఆమెని ఏమనే, ఏమడిగే ధైర్యం ఎవరికీ లేదు. చాలా రోజులుగా ఆమె ప్రేమ వ్యవహారం నలుగురినోళ్ళల్లో నానుతున్నా, ఆమె ఎదుటపడి విమర్శించగలిగే ధైర్యం,

ఆమె చేసిన పని బాగులేదని చెప్పగలిగే సాహసం ఎవరికీ లేకపోయాయి.

హాలులో మాటలన్నీ ఒక్కసారిగా ఆగిపోయాయి... సన్నగా వినిపిస్తున్న సంగీతం తప్ప మరో శబ్దం కొన్ని క్షణాలపాటు వినిపించలేదు. కారణం—నూతన వధూవరులు మేడమెట్లు దిగి వస్తున్నారు. అందరి కళ్ళు అటే తిరిగాయి. అసలే అందగత్తె అయిన శ్యామలాదేవి ఆరోజు మరింత అందంగా, మనోహరంగా కనుపించింది అందరికి. ఒంటి రంగులో కలిసిపోయే ఫారిన్ నైలెక్స్ జరీ పూవుల చీర, అదే రంగు బ్లౌజ్, ఆధునికమైన సిగ, సిగలో విరిసీ విరియని గులాబులు, ఆభరణాల నించి కింద చెప్పుల వరకు అన్నీ మాచింగ్ వే! అన్నిటికంటె ఆరోజు ఆమె మొహంలో నిండిన తృప్తి, సంతోషంవల్ల గాబోలు—రోజూ కంటె చిన్నగా కనిపిస్తూంది. చూస్తూన్న ఎవరూ ఆమెకి నలభై ఏళ్ళన్న నిజాన్ని నమ్మలేకపోతున్నారు. ఆమెపక్కన రామ్ మోహన్ రావు చాలా సింపుల్ గా తెల్లని పైజామా, సిల్కు లాల్చీలతో ఉన్నాడు. ఇద్దరూ క్రిందికి దిగి వచ్చి గెస్టులను ఉద్దేశించి నమస్కారం చేశారు. అందరూ అట్టహాసంగా చప్పట్లుకొడుతూ స్వాగతం చెప్పారు. తాము తెచ్చిన బహుమతులు ఎదురువెళ్ళి అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు మగవాళ్ళు రామ్ మోహన్ రావుకి షేక్ హాండిచ్చారు. శ్యామలాదేవికి మళ్ళీ వైవాహిక జీవితంలో అడుగు పెట్టినందుకు తమ సంతోషాన్ని, అభినందనలని తెలిపారు. మరీ పరిచయస్థులు ఆమె భుజం చుట్టూ చెయ్యివేసి

తమ సంతోషాన్ని ఎలా వ్యక్తంచేయాలో తెలియడం లేదంటూ బాధపడిపోయారు. అందరి అభినందనలని వికసిత వదనంతో, ముకుళితహస్తంతో అందుకుంది శ్యామలాదేవి. బేరర్లు మళ్ళీగ్లాసులు నింపారు. అందరూ గ్లాసులు పైకిఎత్తి, "ఛీర్స్... ఫర్ ది హెల్త్ అండ్ హేపినెస్ ఆఫ్ ది న్యూలీ వెడెడ్ కపుల్" అంటూ విష్ చేశారు.

డ్రింక్ పార్టీ, ఆ తరువాత బయట గార్డెన్‌లో ఏర్పాటు చేసిన డిన్నర్ పార్టీ ఆర్భాటంగా ముగిశాయి. దంపతులు అందరి మధ్య తిరుగుతూ అతిథి మర్యాదలు స్వయంగా చూశారు.

అర్ధరాత్రికి పార్టీ ముగిసింది.

* * *

చాలా రోజుల తరువాత...

ఆ రోజు బీచి ఒడ్డున పెద్ద బహిరంగ సభ జరుగు తూంది. రాజారావు ఉరఫ్ శ్యామలాదేవి మాజీభర్త ఉద్రేకంగా ఉపన్యాసం యిస్తున్నాడు.

"మనది పవిత్ర భారతదేశం! స్త్రీ మన జాతి పవిత్రతకి అపురూపమయిన చిహ్నం. ఆమె భారతనారి. ఆదర్శ గృహిణి, ధర్మపత్నిగా గౌరవించబడాలి. ఆమె స్థానాన్ని గుర్తించి గౌరవించే అవసరం మనకు ఉంది. స్త్రీ కష్టసుఖాలెరిగి ప్రవర్తించిననాడు ప్రతి సంసారం నందనవనం అవుతుంది. మన వివాహ వ్యవస్థలో పరమార్థం ఇదే..."

"హియర్, హియర్!" అని ఆవేశంగా చప్పట్లు చరిచిన భారతనారీ గౌరవ ప్రదాతల్లో మొదట ఉన్నాడు

సూర్యనారాయణ. ఆ ఉపన్యాసానికి ఊగిపోతూ ఆనందపడి పోతున్నాడు.

సముద్రం ఒడ్డున దూరంగా... ఏకాంతంగా ఉన్న చోట రాజారావుగారి మాజీ భార్య... ప్రస్తుతం రామ్ మోహన్ రావు భార్య అతని ఒళ్ళో తల పెట్టుకుని తన్మయావస్థలో వుంది.

"రామ్, మనం ఎంత అదృష్టవంతులం!" శ్యామల అంది. ఆమెని దగ్గరకి తీసుకుంటూ, "ఈ దేశంలో మనం ఇలా దగ్గరవడం జరుగుతుందని కలలో కూడా అనుకోలేదు, శ్యామూ" అన్నాడు. వెన్నెలని చూసి ఎగిరి పడుతున్న కెరటాలు వారిద్దరి భావోద్వేగం ముందు మేం చాలలేమన్నట్లు వారి పాదాల దాకా వచ్చి పడగ ముడిచి జారిపోయిన పాముల్లా జారిపోతున్నాయి.

దూరంగా ఉపన్యాసం సాగుతూనే ఉంది.

సముద్రానికి చేరువగా వున్న గూడెంలో రంగి చెవులు హోరెత్తిస్తున్న ఆ ఉపన్యాసానికి నిద్ర పట్టక విసుక్కుంది. "ఏటిమావాఁ, ఇందాకటి నించి ఏటి సెప్తుండారు.. అబ్బబ్బ, ఇని ఇని సెవులు హోరెత్తిపోతన్నయి. నిద్రట్టిసావడంలేదు" అంది.

"ఏటోనే మనకేటి తెలుస్తుంది, పెద్దోరిగోడవ. పదహే సముద్రం ఒడ్డుకాడకి పోయి సల్లగా ఇసకలో పడుకుందాం" అన్నాడు వెంకటేశు. నిద్రపోతున్న ఇద్దరి పిల్లలని ఇద్దరూ తలో పిల్లని చంకనేసుకుని నడిచి వెళ్ళి, సముద్రం ఒడ్డున ఓ

పడవ చాటున ఆ ఇసకలో పడుకుని కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోయారు.

అదే సముద్రంలో— నిర్మానుష్యమైనచోట— నడి రాత్రి ఒక భారతనారి, ఆదర్శ గృహిణి, ధర్మపత్ని—శకుంతల వచ్చి సముద్రంలో దూకింది.

సముద్రం హోరు ఎక్కువయింది.